క్లుప్తంగా

వేరుశనగ క్వింటా రూ.7,920

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,225 క్వింటాళ్ళ వేరుశనగ రాగ, క్వింటాలుకు గరిష్టం రూ.7920, కనిష్టం రూ. 4160, సరాసరి రూ. 5866 ధరలు లభించాయి. అలాగే, 5 క్వింటాళ్ళ ఆముదం రాగా గరిష్టం రూ. 6360, కనిష్టం రూ.6281, సరాసరి రూ. 6282 ధరలు పలికాయి. 32 క్వింటాళ్ళ వరి (సోన) రాగా, గరిష్టం రూ. 2237, కనిష్టం రూ. 1766, సరాసరిగా రూ. 2110 ధరలు వచ్చాయి. 5 క్వింటాళ్ళ వరి (హంస) రాగా గరిష్టం, కనిష్టం, సరాసరి రూ.1288 లభించింది. 80 క్వింటాళ్ళ కంది రాగా, గరిష్టం రూ. 7021, కనిష్టం రూ. 6206, సరాసరి రూ. 7013 ధరలు వచ్చాయి.

క్షేత్రస్థాయిలో పంటల సందర్శన



అలంపూర్ రూరల్: మండలంలోని బుక్కాపూరంలో శుక్రవారం క్షేత్రస్థాయిలో పంటలను కేవీకే పాలెం ప్రోగ్రాం డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలను అందజేశారు. మినుములు, పెసర పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఆదిశంకర్, ప్రవీణ్‌కుమార్, సీడ్ సర్టిఫికేషన్ అధికారి ప్రసన్న, ఏఈఓ సాయిరామ్, రైతులు మహేశ్వర్‌రెడ్డి, రవికుమార్, విష్ణువర్ధన్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వల్లూరు గ్రామానికి చెందిన బీసన్న శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం అబ్రహం శుక్రవారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ధర్మారెడ్డి, వేణుగోపాల్ నాయుడు, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బ్యాంక్ ఖాతా



ఉండవెల్లి: మండలంలోని తక్కశిలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 100 మంది విద్యార్థులకు ఉచిత అకౌంట్లను అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు రాములు తెలిపారు. కెనారా బ్యాంక్ సౌజన్యంతో ఏటీఎం, పాస్‌బుక్కులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కెనారా బ్యాంక్ మేనేజర్ సాయి కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ గాడ్సే, ఉపాధ్యాయులు ఖాజా భాషా, సుధాకర్ పాల్గొన్నారు.

సమాచారమిస్తే సమస్య పరిష్కారం

గద్వాల అర్బన్: జిల్లాలో ఎక్కడైనా విద్యుత్ అంతరాయం కలిగితే రైతులు వెంటనే 9491564668కు సమాచారం అందించాలని ఎస్ఈ భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామం, మండలం, పేరుతో వాట్సప్‌లో సమాచారం అందిస్తే సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా వెల్ఫేర్ కమిటీ మెంబర్‌కు అభినందన



అయిజ: జిల్లా వెల్ఫేర్ మెంబర్‌గా నియామకమైన జమాలుద్దీన్‌ను శుక్రవారం పట్టణంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, సతీష్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళకు గాయాలు

మానవపాడు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత శుక్రవారం చెన్నిపాడు గ్రామంలోని శివారు ప్రాంతంలో రైల్వేట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొన్నది. ఈ ఘటనలో మహిళకు కాలు, చేయి విరిగిందని స్థానికులు తెలిపారు. చికిత్స నిమిత్తం గాయపడిన మహిళను కర్నూల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై రైల్వే పోలీస్‌లను వివరణ కోరగా కేసు నమోదు కాలేదని తెలిపారు.

అంధత్వ నివారణే లక్ష్యం

ఉండవెల్లి: అంధత్వ నివారణే లక్ష్యమని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం శుక్రవారం మండలంలోని చిన్న ఆముదాలపాడులో కంటి వెలుగు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. అదేవిధంగా కంచుపాడులో సురవరం వెంకట్రామిరెడ్డి విజ్ఞాన కేంద్రంలో సీడీఎస్‌పీ ఆధ్వర్యంలో యువజనోత్సవంలో భాగంగా నిర్వహించిన క్రీడలలో గెలుపొందిన జట్లకు ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడు కపిల్‌తో కలిసి కలెక్టర్ బహుమతులు అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో మన ఊరు– మన బడి కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, విజయలక్ష్మి, కపిల్, నివేదిత, సీపీఐ జిల్లా నాయకులు ఆంజనేయులు, రాజు, పెద్దబాబు, సర్పంచు శేషన్ గౌడ్, ఎంపీపీ బీసమ్మ, వైస్ ఎంపీపీ దేవన్న, సర్పంచులు రేఖ, శేషన్ గౌడ్, నాగేష్, ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి, ఎంపీఓ పద్మావతి, పీఆర్ డీఈ సలీమ్, ఎంఈఓ శివ ప్రసాద్, తహసీల్దార్ వీరభద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా మండలంలోని చిన్న ఆముదాలపాడులో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 180 మందికి శుక్రవారం పరీక్షలు నిర్వహించారు. 66 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు వీణశ్రీ, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలోని రైతు వేదికలో వైద్యాధికారి తిమ్మప్ప, చిన్నోనిపల్లె గ్రామ పంచాయతీలో వైద్యాధికారి నరేష్‌ల ఆధ్వర్యంలో కంటి పరీక్షలను నిర్వహించారు. మొత్తం 273 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, కంటిశుక్లాలు ఉన్నవారు 55 మంది, మెల్లకన్ను–1, రీడింగ్ గ్లాసులు–72 మందికి, కంటి చూపు అద్దాల కోసం 91 మందిని గుర్తించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.



చిన్న ఆముదాలపాడులో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నెలో డాక్టర్ అశ్విని ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేశారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర బాలమ్మ, ఏఎన్ఎం సురేఖ, నర్మద, ఆశవర్కర్లు ఉన్నారు.

రాజోళి: మండల కేంద్రంలో 118 మందికి కంటి పరీక్షలు చేయగా, 28 మందికి అద్దాలను పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు. ఒకరికి ఆపరేషన్ అవసరమని నిర్ధారించారు. కార్యక్రమంలో డాక్టర్ మధుబాబు, సూపర్‌వైజర్ రామకృష్ణ, మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: అలంపూర్‌లో కంటి వెలుగు కేంద్రంలో మొత్తం 164 మందికి పరీక్షలు చేశారు. క్యాతూర్ పీహెచ్‌సీలో 155 మందికి కంటి పరీక్షలు చేసుకున్నారు. అలంపూర్‌లో 54 మందికి ఆపరేషన్‌కు రిఫర్ చేశారు. 101 మందికి కళ్ల అద్దాలను అందజేశారు. క్యాతూర్ పీహెచ్‌సీలో 26 ఆపరేషన్‌కు రిఫర్ చేయగా, 66 మందికి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రసూన రాణి, హేమమనసా, రామస్వామి, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని బింగుదొడ్డి, మేడికొండ, కిష్టాపురం గ్రామాల్లో రెండవ రోజు కంటి వెలుగు కార్యక్రమం కొనసాగింది. కిష్టాపురంలో కంటివెలుగు కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారిని శాభీల భాను పరిశీలించారు. మేడికొండలో మొత్తం 160 మంది, కిష్టాపురంలో 187 మంది, బింగుదొడ్డిలో 163 మంది కంటి పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని రెడ్డి కమ్యూనిటీ హాల్‌లో 152 మంది పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కంటి అద్దాలను ఇచ్చారు.



అలంపూర్‌లో ..



రాజోళిలో ..



అయిజ కిష్టాపురంలో..

బయో యంత్రాలతో మేలు



అలంపూర్‌లో బయోమైనింగ్ యంత్రాలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

అలంపూర్: బయో యంత్రాలను ఎంతో మేలు, సమయం ఆదా అవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీకి చేరిన బయోమైనింగ్‌కు సంబంధించిన యంత్రాలను మున్సిపల్ చైర్ పర్సన్, మున్సిపల్ ఇంజనీర్ మేఘనాథ్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఎస్‌డీఎస్ టెక్నాలజీ సంస్థ బయోమైనింగ్ యంత్రాలను మున్సిపాలిటీకి పంపించినట్లు వారు తెలిపారు. ఈ యంత్రాల సహాయంతో తడి, పొడి చెత్త వేరు చేయడం జరుగుతుందన్నారు. ఎస్‌డీఎస్ సంస్థ ప్రతినిధి నాగరాజుతో మాట్లాడి ఈ యంత్రాలు త్వరగా అందుబాటులోకి తేవడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వీరితోపాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సామేల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, లక్ష్మీనారాయణ, విద్యుత్ అధికారి శాలన్నను ఉన్నారు.

‘ఓట్ల కోసమే కంటి వెలుగు’

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వం ఓట్ల కోసమే కంటి వెలుగు కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని బీఎస్పీ నాయకుడు రాంబాబు అన్నారు. శుక్రవారం ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురం, యాక్తాపురం గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమం పేరుతో ప్రభుత్వం రూ.250 కోట్ల ప్రజా ధనాన్ని వృథా చేస్తుందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా రాష్ట్రంలోని అన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో కంటి వైద్యులను నియమిస్తే సరిపోతుందన్నారు. ప్రభుత్వం కంటి వైద్యులను నియమిస్తే తరతరాలుగా గ్రామీణ, పట్టన ప్రజలు ఆరోగ్య కేంద్రాలను సందర్శించి కంటి సమస్యలను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. పరిమిత నెలల్లో కంటి వెలుగును నిర్వహిస్తే మిగిలిన నెలల్లో ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న రాంబాబు

వృత్తి విద్యా కోర్సులతో ప్రయోజనం



ప్రారంభిస్తున్న సర్పంచు మాశమ్మ

ధరూరు: మండలంలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలకు 2022–23 విద్యా సంవత్సరానికి మంజూరైన రెండు వృత్తి విద్యా కోర్సులను శుక్రవారం సర్పంచు మాశమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు వృత్తి విద్యా కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కుట్టు మిషన్‌లో శిక్షణ, బ్యూటీషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు నైపుణ్యం సాధించి సంబంధిత వృత్తిలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రేణుక, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు ఉచిత మందులు

గట్టు: ప్రభుత్వ ఆస్పత్రిలో టీబీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులను అందజేస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ సాధిక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సాధిక్ మాట్లాడుతూ టీబీపై ఇంటింటా సర్వే నిర్వహించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. జనవరి నుంచి డిసెంబర్ వరకు 276 కొత్త కేసులను గుర్తించాలనే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. సబ్ సెంటర్ వారిగా 5 వేల జనాభా ఉన్నచోట 10 కొత్త కేసులను గుర్తించాలన్నారు. టీబీని నిర్ధారించిన తర్వాత కుటుంబ సభ్యులకు ఇగ్రా టెస్టును నిర్వహించాలన్నారు. ఇగ్రా నమూనాలను సేకరించి గద్వాల ఆస్పత్రికి తరలించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఊసేని, టీబీ సూపర్ వేజర్ సోమశేఖర్, హెల్త్ మక్బూద్, హెల్త్ అసిస్టెంట్ వెంటస్వామి, టీబీ ఎల్‌టీ నరేందర్‌బాబు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న సాధిక్

హరితహారం మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ

మల్దకల్: హరితహారంలో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు కోరారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామ సమీపంలో రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కల చుట్టూ పాదులు తవ్వి వాటికి ట్రీగార్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వచ్చే హరితహారం నాటికి మొక్కలను పెంచాలని నర్సరీ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు ఉమేరా, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంటు రఘుపతి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.



అమరవాయిలో మొక్కలకు పాదులు తీస్తున్న కూలీలు

కిరాణం దుకాణాలలో చోరీ

కేటీదొడ్డి: మండలంలోని చింతలకుంట గ్రామంలోని పలు కిరాణా దుకాణాలలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. దుకాణానికి వేసిన తాళాలు, రేకులు తీసి లోపలికి చొరపడ్డారు. మొత్తం నాలుగు కిరాణ దుకాణంలో దొంగతనానికి పాల్పడ్డారు. మొత్తం రూ.68 ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. బడేసాబ్, నర్సింహశెట్టి, సత్యనారాయణ శెట్టి, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై అజాగ్రత్తతో డ్రైవింగ్ చేసి కారు ప్రమాదానికి కారణమైన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కోదండాపురం ఎస్సై వెంకటస్వామి తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం కర్నూల్ పట్టణానికి చెందిన విక్టర్ తన కారులో కుటుంబ సభ్యులతో కలిసి గురువారం హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై ఇటిక్యాల మండలంలోని వల్లూరు స్టేజీ సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న కారును మరో కారు అతివేగంతో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విక్టర్ భార్యతో పాటు, కూతురుకి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించారు. విక్టర్ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ రితిన్ పటేల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



గట్టు: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చాగదోన గ్రామానికి చెందిన గుండ్ల చిన్న వెంకటేష్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండానే ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా మండల కేంద్రంలో పట్టుబడినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఇసుక తరలింపునకు సంబంధించిన అనుమతి పత్రాలు లేక పోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మల్దకల్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బిజ్వారంలో సర్పంచు లక్ష్మన్న ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ రాజారెడ్డి మాట్లాడుతూ గ్రామాలను అన్నీ విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి రూ.74 లక్షల నిధులను కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, పీఏసీఎస్ డైరెక్టర్ రాజేష్, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గద్వాల అర్బన్: పెన్షనర్ల సంఘం జిల్లా కమిటీకి సంబంధించి నూతన సంవత్సరం 2023 డైరీ, క్యాలెండర్‌ను శుక్రవారం ఆ సంఘం జిల్లా ట్రెజరీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ పాషా, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ బాబు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

గద్వాల అర్బన్: కేజీబీవీల్లో నాన్‌టీచింగ్ వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నాన్ టీచింగ్ వర్కర్స్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేజీబీవీల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వారిని పర్మినెంట్ చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల మేరకు ఈనెల 30న హైదరాబాద్‌లోని ఎస్‌పీడీ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు, నాన్ టీచింగ్ వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జమ్మిచేడు కార్తీక్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, వెంకటేష్, నర్సింహులు, పరుశరామ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న అరుణ్ కుమార్

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి

శాంతినగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, బీజేపీ ప్రభుత్వం ఏమేం అభివృద్ధి చేస్తుందో ఆ విషయాలు ప్రజలకు వివరించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. వడ్డేపల్లి మండలంలోని తనగలలో బూత్ కమిటీల అధ్యక్షుల సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షుడు నరసింహ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని 12 మంది దళిత బిడ్డలకు కేంద్ర కేబినెట్లో అవకాశం కల్పించారన్నారు. రాష్ట్రంలో దళితబంధు కార్యకర్తలకు, నాయకులకు మాత్రమే ఇస్తున్నారన్నారు. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా మారడంతోనే కేసీఆర్ పతనం ప్రారంభమైందన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని పక్కన పెట్టి చెరుకు రైతుల కడుపు కొట్టిన ఘనత కేసీఆర్‌దే అని ఆరోపించారు. తెలంగాణ ప్రజలను మందు బానిసలుగా చేసి కార్మిక, కర్షకులను దోచుకుంటున్న మహానుభావుడు కేసీఆర్ అన్నారు. కార్యక్రమంలో రంజిత్‌పటేల్, హరికృష్ణ, ఆంజనేయులు, రాజు యాదవ్, సతీష్, రాజశేఖర్‌రెడ్డి, ఉరుకుందయ్యచారి పాల్గొన్నారు.

ధరూరు: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పేరు, నర్సన్‌దొడ్డి, ఖమ్మంపాడు, మాల్‌దొడ్డి, గుడ్డెందొడ్డి గ్రామాల్లో బూత్ కమిటీలు, పన్నా ప్రముఖ్ నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా నాగర్‌కర్నూలు పార్లమెంటుకో కన్వీనర్ సంజీవ్ భరద్వాజ్, సీనియర్ నాయకులు రాంచంద్రారెడ్డిలతో పాటి జిల్లా అధ్యక్షుడు హాజరయ్యారు. కార్యక్రమంలో మండల నాయకులు అంజిరెడ్డి, నర్సన్‌దొడ్డి కృష్ణారెడ్డి, కిష్టన్న, లక్ష్మారెడ్డి, సహదేవుడు, నర్సింహులు, సుధాకర్‌రెడ్డి సర్పంచులు మాశమ్మ, సరళమ్మ, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత గుట్కాలు విక్రయిస్తే చర్యలు

ధరూరు: నిషేధిత గుట్కాల అమ్మకాలపై మండలంలోని ఆయా గ్రామాల్లోని దుకాణాల్లో ఆబ్కారీ పోలీసులు తనిఖీలు చేశారు. శుక్రవారం సాయంత్రం పోలీస్ అండ్ ఈఎస్ఐ క్రిష్ణ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపాలెం, ఉప్పేరు, అల్వలపాడు, ద్యాగదొడ్డి గ్రామాల్లోని గుట్కాల అమ్మకాలపై దుకాణదారులకు అవగాహన కల్పించారు. గుట్కాలు విక్రయించినా కొనుగోలు చేసినా చట్టరిత్యా నేరమన్నారు. అలాగే అనధికారికంగా మద్యం విక్రయాలు జరిపినా చర్యలు తప్పవని, కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో సారా విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



తనిఖీ చేస్తున్న ఆబ్కారీ పోలీసులు

సీసీ రోడ్డు పరిశీలన

అయిజ: పట్టణంలో పాత బస్టాండ్‌లో నిర్మించిన సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతనంగా నిర్మించిన సీసీరోడ్డు మార్గం ద్వారా ప్రయాణించొద్దని రోడ్డు క్యూరింగ్ అయ్యేంత వరకు ఇతర మార్గాల ద్వారా వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న

ఆలయాన్ని దర్శించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్



రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద జెడ్పీ చైర్‌పర్సన్

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ సరిత దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సత్యారెడ్డి స్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రామస్తులు సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచు గోకరి, తదితరులు పాల్గొన్నారు.

అనుమానిత కుష్టువ్యాధి గ్రస్తుల ఇళ్ల సందర్శన

అలంపూర్ రూరల్: క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలోని అనుమానిత కుష్టు వ్యాధిగ్రాస్తుల ఇళ్లను శుక్రవారం రాష్ట్ర కుష్టు వ్యాధి అధికారి డాక్టర్ సంతోష్ లత సందర్శించారు. తీసుకోవల్సిన జాగ్రత్తలను, సూచనలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ పీఎంఓ ప్రేమ్‌సాగర్, మదన్‌మోహన్, బాలీశ్వరయ్య అరుణ తదితరులు ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న సంతోష్ లత

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న నాయకులు

అలంపూర్: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహంను శుక్రవారం ధన్వంతరి వెంకటేశ్వర స్వామి ఉత్సవ కమిటీ నాయకులు కలిశారు. ఈ నెల 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు అయిజ మండలం ఉత్తనూరులో జరిగే ధన్వంతరి వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు హాజరుకావాలని గౌతమ్ రెడ్డి, హనుమంత్ రెడ్డిలు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేశారు.

సభను విజయవంతం చేద్దాం

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): టీపీసీసీ ఆధ్వర్యంలో ఈ నెల 22న నాగర్‌కర్నూల్ జిల్లా బుద్దారంలో నిర్వహించే దళిత, గిరిజన ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములుయాదవ్ కోరారు. మండల కేంద్రంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గోవిందు, ఎల్లస్వామి, రాముడు, ఆశన్న, మదిలేటి పాల్గొన్నారు.